క్లుప్తంగా

నేడు సహస్ర తులసీదళార్చన

దాబాగార్డెన్స్ : కనకమహాలక్ష్మి దేవాలయంలో గురువారం ఉదయం 8 నుంచి 9 గంటల వరకు సహస్ర తులసిపూజ నిర్వహించనున్నారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,500 రుసుం చెల్లించి పాల్గొనవచ్చు. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్‌కొత్త రోడ్డు శాఖ, అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్‌ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806091లో రుసుం చెల్లించాలి. ఆన్‌లైన్ ద్వారా ట్రాన్స్‌ఫర్ చేసిన భక్తులు వివరాలు, పూజ జరిపించాల్సిన వారి పేరు, గోత్రనామాలు, పూర్తి చిరునామా 8985515989 నంబరుకు వాట్సప్ చేయాలి.

ఎరుకుమాంబకు జలాభిషేకం


ఎరుకుమాంబ అమ్మవారికి జలాభిషేకం చేస్తున్న భక్తులు

సీతమ్మధార : జీవీఎంసీ 27వ వార్డు దొండపర్తిలో వెలసిన ఎరుకుమాంబ అమ్మవారికి బుధవారం భక్తులు జలాభిషేకం చేశారు. ఆలయ ఈవో జి.వి.రమాబాయి ఉదయం ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకుడు శ్రీనివాస్ భక్తుల నామగోత్రాలతో అమ్మవారిని పూజించారు. సాయంత్రం కూడా ఎరుకుమాంబ అమ్మవారిని పసుపు, కుంకమలతో అభిషేకించారు. ఈ సందర్భంగా అమ్మవారిని పలు రకాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది సత్యనారాయణరాజు తదితరులు పాల్గొన్నారు.

24న 35వ వార్డులో 'జగనన్న ఆరోగ్య సురక్ష'


డాక్టర్ సందేష్

జగదాంబ : జీవీఎంసీ 35వ వార్డులో ఈనెల 24న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు ప్రసాద్‌గార్డెన్స్ వైఎస్సార్ ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి సందేష్ బుధవారం తెలిపారు. వార్డులో టౌన్‌కొత్తరోడ్డు సచివాలయానికి సంబంధించి ప్రసాద్‌గార్డెన్స్ ఆస్పత్రిలో శిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజలందరూ ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అన్ని రకాల పరీక్షలతో పాటు అవసరాన్ని బట్టి మరింత మెరుగైన వైద్యం కోసం కేజీహెచ్, ప్రైవేట్ ఆస్పత్రులకు తరలిస్తామన్నారు. ఈ శిబిరంలో మందులు కూడా ప్రభుత్వం ఉచితంగా అందిస్తుందన్నారు. గతంలో చూపించుకున్న రోగులందరు పాత సురక్ష కార్డులతో రావాలన్నారు. లేని వారికి మళ్లీ కొత్త కార్డులు ఇస్తామని ఆయన తెలిపారు.

పేదల ఆశాజ్యోతి జ్యోతిబసు


జ్యోతిబసు చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

మద్దిలపాలెం: పశ్చిమ బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి, సీపీఎం మొదటి తరం నాయకుల్లో ఒకరైన దివంగత జ్యోతిబసు పేదల ఆశాజ్యోతి అని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి సభ్యుడు, 78 వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు కొనియాడారు. మద్దిలపాలెంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో జ్యోతిబసు 14వ వర్ధంతి సభ మద్దిలపాలెం జోన్ కార్యదర్శి వి.కృష్ణ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా జ్యోతిబసు చిత్ర పటానికి పార్టీ సీనియర్ నాయకులు జి.వి.ఎన్.చలపతి, సిహెచ్.ఎల్.ఎన్.శాస్త్రి, ఎ.వి.పద్మావతి, గంగారావు పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం గంగారావు మాట్లాడుతూ భారత్‌లో దోపిడీ వ్యవస్థను కూల్చి సోషలిస్టు వ్యవస్థ రావాలన్న సిద్ధాంతాన్ని నమ్మిన గొప్ప విప్లవకారుడన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు పీతల అప్పారావు, వి.తులసీరాం, దండు నాగేశ్వరరావు, ఎం.ప్రదీప్, జి.వి.రమణ, రమాప్రభ, కుమారి, తదితరులు పాల్గొన్నారు.

'జగనన్న సురక్ష..' ఆరోగ్యానికి భరోసా

పరిపాలనలో కొత్త ఒరవడి సృష్టించిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అన్ని రంగాలు, అన్ని వర్గాలకు న్యాయం చేస్తూ సంక్షేమ పాలన అందిస్తున్నారు. పేదలకు మెరుగైన వైద్యం అందించేందుకు రూపొందించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు ఇందుకు చక్కటి ఉదాహరణ. ఈ శిబిరాలలో రోగులకు కార్పొరేట్ స్థాయి వైద్యం అందిస్తూ పేదల సంపూర్ణ ఆరోగ్యానికి సీఎం అలుపెరుగని కృషి చేస్తున్నారు. తమ పట్ల ముఖ్యమంత్రి జగన్ కనబరుస్తున్న శ్రద్ధకు పేద ప్రజలు ఆయనకు నీరాజనం పలుకుతున్నారు.


వైద్య శిబిరంలో రోగులను పరీక్షిస్తున్న వైద్యాధికారిణి

- కొబ్బరితోట ఆరోగ్య శిబిరంలో 250 మందికి వైద్య పరీక్షలు
- గర్భిణులు, బాలింతలకు పోషకాహారంపై అవగాహన

అల్లిపురం : ప్రజల ఆరోగ్యమే లక్ష్యంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోంది. కొబ్బరితోట–1 సచివాలయం పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష టోకెన్లు జారీ చేసిన వారికి డాక్టర్ వైఎస్సార్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం నిర్వహించిన శిబిరంలో వైద్య సేవలందించారు. ఈ శిబిరానికి పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరయ్యారు. ఈ వైద్య శిబిరంలో సుమారు 250 మందిని వైద్యులు పరీక్షించి మందులు అందజేశారు. వారిలో అవసరమైన వారిని మెరుగైన వైద్యం నిమిత్తం కేజీహెచ్‌కు రిఫర్ చేశారు. శిబిరంలో సుమారు 200 రకాల మందులు సిద్ధంగా ఉంచారు. గర్భిణులు, బాలింతలు, చిన్నపిల్లలు ఏ విధమైన పోషకాహారం తీసుకోవాలో ఆశ వర్కర్లు వివరించారు. శిబిరంలో అందజేసిన వైద్య సేవల పట్ల హాజరైన లబ్ధిదారులు సంతృప్తి వ్యక్తం చేశారు.


పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

జ్వరంతో వచ్చాను..



మాది కొబ్బరితోట. జ్వరానికి చికిత్స కోసం వచ్చాను. డాక్టర్లు బాగా తనిఖీ చేశారు. అవసరమైన సూచనలు చేసి మందులు అందజేశారు. మా లాంటి పేదల కోసం ఇలాంటి శిబిరాలు ఏర్పాటు చేసిన జగన్ బాబుకు ధన్యవాదాలు.
– డి.పైడితల్లి, కొబ్బరితోట

మెరుగైన వైద్యం అందించారు



నీరసం, నిస్సత్తువతో బాధపడుతున్నాను. జగనన్న ఆరోగ్య సురక్ష అవగాహన కార్యక్రమంలో వైద్య శిబిరానికి రమ్మని టోకెన్ ఇచ్చారు. ఇప్పుడు శిబిరంలో వైద్యులు పరీక్షించి అవసరమైన మందులు ఇచ్చారు. మంచి కార్యక్రమం. ముఖ్యమంత్రి జగన్ బాబుకు కృతజ్ఞతలు.
– కె.లక్ష్మి, కొబ్బరితోట

ఉత్సవ కమిటీ సభ్యులకు సత్కారం

అల్లిపురం : బల్లిగిరి శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి దేవస్థానం ఉత్సవ కమిటీ సభ్యులు బుద్ద గోపాలకృష్ణ, కె.శివ సంతోష్‌కుమార్, తాడి అనురాధ, వలిశెట్టి లక్ష్మి, ఒమ్మి హరి, బొడ్డేటి కిషోర్, కొల్లి సత్యవతి, పాల్తేటి శివకుమార్, పీలా రవి చంద్రశేఖర్, వైఎస్సార్‌సీపీ 33వ వార్డు నాయకులు, కార్యకర్తలు ఎం.రమేష్, పచ్చిరపల్లి రాము, కృష్ణారెడ్డిలను దేవస్థానం ఈవో జీవీ రమాబాయి బుధవారం పరస మహోత్సవం సందర్భంగా సత్కరించారు. అన్నసమారాధన కార్యక్రమాన్ని కూడా కమిటీ దగ్గరుండి పర్యవేక్షించి ఉత్సవాలను దిగ్విజయంగా పూర్తి చేయాలని కోరారు. అనంతరం ఉత్సవ కమిటీ సభ్యులు ఈవో రమాబాయిని సత్కరించి, మెమెంటో అందజేశారు.


ఈవో రమాబాయిని సత్కరిస్తున్న ఉత్సవ కమిటీ సభ్యులు

ప్రపంచ దేశాలకు ఆధ్యాత్మిక గురువు భారత్

ఎంపీ జీవీఎల్ నరసింహారావు


బ్రహ్మ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంపీ జీవీఎల్, బ్రహ్మకుమారీస్ ప్రతినిధులు

అల్లిపురం : ప్రపంచ దేశాలకు భారత్ ఆధ్యాత్మిక నాయకత్వం వహిస్తుందని ఎంపీ జీవీఎల్ నరసింహారావు అన్నారు. ప్రజాపిత బ్రహ్మకుమారీస్ స్థాపించిన బ్రహ్మ బాబా 55వ అవ్యక్త స్మృతి దినోత్సవం సందర్భంగా వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో బుధవారం జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్రహ్మకుమారీస్ సంస్థ అందిస్తున్న సేవలు అమోఘం అన్నారు. మానసిక ఒత్తిడి నుంచి బ్రహ్మకుమారీ బోధనల ద్వారా విముక్తి కలుగుతుందన్నారు. ప్రధాని మోదీ దేశంలో యోగాకి విస్తృత ప్రాచుర్యం కల్పించారన్నారు. సంస్థ ప్రతినిధి రామేశ్వరి మాట్లాడుతూ ఈ నెల 21వ తేదీ ఆదివారం సాయంకాలం బీచ్‌రోడ్డు అన్నమయ్య విగ్రహం వద్ద అమరజ్యోతి బుర్ర కథా బృందం వారిచే పితాశ్రీ బ్రహ్మబాబా అద్భుత పావన జీవిత చరిత్ర విని, చూసి తరించాలని కోరారు. బ్రహ్మ పోస్టర్‌ను ముఖ్య అతిథి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో విశాఖ సమాచారం ఎడిటర్ వీరభద్రరావు, సంస్థ ప్రతినిధులు రమా, బీకే శివ లీల, శశికళ, సత్యవతి, బీకే వేణి తదితరులు పాల్గొన్నారు.

'భవదీయం' ఆధ్వర్యంలో ఆధ్యాత్మిక కార్యక్రమాలు

మురళీనగర్: భవదీయం సేవా సంస్థ ద్వారా ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు సంస్థ గౌరవ అధ్యక్షుడు కట్టమూరి శ్రీనివాసరావు తెలిపారు. మురళీనగర్‌లో భవదీయం స్వచ్ఛంద సేవా సంస్థను బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ సంస్థ ఆధ్వర్యంలో దేశంలోని ప్రముఖ దేవాలయాలకు స్వచ్ఛంద సేవకులను పంపిస్తామన్నారు.

రహదారులపై చెత్త తొలగించాలి

జగదాంబ : వరుస పండగల నేపథ్యంలో రహదారుల పక్కన ఉండిపోయిన చెత్త కుప్పలను వెంటనే ఎత్తివేయాలని జీవీఎంసీ జోన్–4 ఏఎంహెచ్‌వో రాజేష్ అన్నారు. బుధవారం ఆయన జోన్ పరిధిలోని 12 వార్డుల్లో పర్యటించారు. ఈ సందర్భంగా పారిశుధ్య అధికారులు, సెక్రటరీలు, సిబ్బందితో మాట్లాడారు. గత మూడు రోజులుగా ఏర్పడిన చెత్త ఎత్తివేసి రహదారులు పరిశుభ్రంగా ఉంచాలన్నారు. జగదాంబ, బీచ్‌రోడ్డు, పూర్ణామార్కెట్, వన్‌టౌన్ వంటి ప్రాంతాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రం చేయాలన్నారు. స్థాయికి మించి చెత్త ఉంటే ఆయా ప్రాంతాల్లో అదనపు వాహనాలు పెట్టి చెత్త డంపింగ్ యార్డుకు తరలించాలన్నారు. క్లాప్ వాహనాలు రోజు ఉదయం ఆరు గంటలకే వార్డులోకి వెళ్లి చెత్త సేకరించాలన్నారు. సెక్రటరీలు విధిగా పారిశుధ్య సిబ్బందితో పనులు చేయించి రికార్డులో నమోదు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, సెక్రటరీలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


రహదారి పక్కనున్న చెత్త ఎత్తిస్తున్న ఏఎంహెచ్‌వో రాజేష్

వైభవంగా వెంకటేశ్వరమెట్ట పరస

- ఆకట్టుకున్న ఆట వస్తువులు.. రంగుల రాట్నాలు
- సందడి చేసిన పిల్లలు.. పెద్దలు
- విశేష అలంకరణలో బల్లిగిరి వెంకన్న



అల్లిపురం : వెంకటేశ్వరమెట్ట పరస బుధవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గోవింద్ రోడ్డు, వెంకటేశ్వర మెట్ట ప్రాంతాలలో వ్యాపారులు పెద్ద ఎత్తున దుకాణాలు ఏర్పాటు చేశారు. వెంకటేశ్వరమెట్ట, బంగారుమెట్ట, సింహాలదేవిడి, అమ్మవారివీధి, కుమ్మరవీధి, అల్లిపురం మెయిన్‌రోడ్డు ప్రాంతాలతో పాటు నగరంలో పలు ప్రాంతాల నుంచి సందర్శకులు తరలి రావటంతో ఈ ప్రాంతం సందడిగా మారింది. ఈ సందర్భంగా చిన్నారులు రంగుల రాట్నాలు, జంపింగ్ గేమ్స్‌తో సందడి చేశారు. చెరకు గడలు, పంచదార చిలకలు, రంగు రంగుల బొమ్మల దుకాణాల వద్ద పెద్దలు, పిల్లలు ఉత్సాహంగా గడిపారు. బూరలు, వాయిద్యాలు, బెలూన్లు కొనుగోలు చేసేందుకు పోటీ పడ్డారు. ఈ సందర్భంగా బల్లిగిరి శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. స్వామిని చెరకు గడలతో అలంకరించారు.


పరసలో సందర్శకుల సందడి


బల్లిగిరి దేవస్థాన ప్రాంగణంలో మిరుమిట్లు గొల్పుతున్న విద్యుద్దీప కాంతులు


పిల్లల ఆటబొమ్మల దుకాణం వద్ద సందడి


వెంకటేశ్వరమెట్ట పరసకు హాజరైన జనం

దొంగతనాల కట్టడికి 'నిఘా'


బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లో సీసీ కెమెరాలు



పోర్టు తూర్పు గేటు వద్ద సీసీ కెమెరా

సీతమ్మధార: సంక్రాంతి పండగ సెలవుల నేపథ్యంలో దొంగతనాలు జరగకుండా సీతమ్మధారతో పాటు పలు ప్రాంతాల్లో నిఘా నేత్రాలు పర్యవేక్షిస్తున్నాయి. జీవీఎంసీ కమిషనర్, పోలీస్ కమిషనర్ల ఆధ్వర్యంలో పర్యవేక్షించేలా ఎటువంటి భద్రతా లోపం లేకుండా సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. పోలీస్ కమిషనరేట్‌లోని సీపీ కార్యాలయంలో గల కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో సీసీ ఫుటేజీలను వీక్షించేలా చర్యలు చేపట్టారు. బాలయ్యశాస్త్రి లేఅవుట్, పోర్టు తూర్పు గేటుతోపాటు ఇతర ప్రదేశాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి, పోలీసులు పర్యవేక్షిస్తున్నారు. అల్లర్లు, అసాంఘిక కార్యకలాపాలు, దొంగతనాలు, దోపిడీలు జరగకుండా పోలీస్ శాఖ, జీవీఎంసీ, ఇతర శాఖల అధికారులు నిరంతరం గమనిస్తున్నారు. సీసీ కెమెరాల ద్వారా దొంగతనాలు, చైన్ స్నాచింగ్‌లు జరగకుండా ముందు జాగ్రత్తలు తీసుకుంటున్నారు.

తగ్గిన కాలీఫ్లవర్ ధర


రైతుబజార్‌లో విక్రయిస్తున్న కాలీఫ్లవర్స్

సీతమ్మధార: సీతమ్మధార రైతుబజార్‌లో విక్రయిస్తున్న కాలీఫ్లవర్ ధర తగ్గింది. కొద్ది రోజులుగా కిలో రూ.34కు విక్రయిస్తున్నారు. బుధవారం ఒక్కసారిగా రూ.22కు ధర తగ్గడంతో వినియోగదారులు, హోటల్, తోపుడుబళ్ల వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారు. గతంలో కాలీఫ్లవర్ రాజమహేంద్రవరం నుంచి వచ్చేది. ప్రస్తుతం అనకాపల్లి జిల్లాలోని ఆర్లీ, సంతపాలెం రైతులు పండించి బజార్‌కు తీసుకొచ్చి విక్రయిస్తున్నారు. మరి కొదిరోజుల్లో కిలో ధర రూ.10కు దిగివచ్చే అవకాశం ఉంది.

కురుక్షేత్ర రహిత భారతం 'ఇట్లసుత' కావ్యం



ప్రసంగిస్తున్న రచయిత వరికొండ కాంతారావు

సీతంపేట: సహృదయ సాహితీ ఆధ్వర్యంలో బుధవారం ప్రిజమ్ కళాశాలలో నిర్వహించిన సాహితీ సమావేశంలో రచయిత వరికొండ కాంతారావు (వరంగల్) స్వీయ రచన 'ఇట్లసుత'పై ప్రసంగించారు. భారతంలో యుద్ధం వల్ల కలిగే ప్రాణ నష్టం శ్రీకృష్ణుడికి ఇష్టం లేదని, అందువల్ల కర్ణుడు కౌరవ పక్షం నుంచి పాండవ పక్షంలోకి వస్తే యుద్ధాన్ని నివారించే వీలుంటుందన్న ఆలోచనతో ఇట్లసుత కావ్యాన్ని రచించినట్లు తెలిపారు. ఇట్లసుత తెలంగాణ మాండలికంలో వెలసిన సంపూర్ణ ఇతిహాసమని, భారతంలో ప్రతి పాత్ర అంతర్మథనాన్ని, ఆలోచనలను చక్కగా చిత్రించినట్లు చెప్పారు. సహృదయ సాహితి అధ్యక్షుడు శేఖరమంత్రి ప్రభాకర్ మాట్లాడుతూ ఇట్లసుత కావ్యం కురుక్షేత్ర రహిత భారతం రచనని, జన నష్టం జరగకుండా రచయిత నైపుణ్యంతో వైవిధ్య రచన చేశారన్నారు. అనంతరం రచయిత కాంతారావును ఘనంగా సత్కరించారు. సమావేశంలో రచయితలు కె.జి.వేణు, డి.వి.సూర్యారావు, సిహెచ్.చినసూర్యనారాయణ, కొత్తూరి రమణ, కుప్పిలి భీమేశ్వరరావు, రాధారాణి, సూకరాజు, వేదుల కామేశ్వరశర్మ, రామతాత పాల్గొన్నారు.

'కళా ఉత్సవ్' విజేత రిషికకు సత్కారం


రిషికను సత్కరిస్తున్న కేవీ వాల్తేర్ ప్రిన్సిపాల్ కమల్‌జీత్

తాటిచెట్లపాలెం: జాతీయ స్థాయిలో ఎన్‌సీఈఆర్‌టీ నిర్వహించిన విభిన్న కళారంగాల పోటీల్లో తాటిచెట్లపాలెం కేంద్రీయ విద్యాలయ వాల్తేర్‌కు చెందిన పదో తరగతి విద్యార్థిని జి.రిషిక అద్భుతమైన కళా నైపుణ్యంతో మొదటి స్థానం సాధించింది. కేంద్ర విద్యా శాఖ సహాయ మంత్రి, కేంద్రీయ విద్యాలయ సంఘటన్ కమిషనర్, రీజనల్ డిప్యూటీ కమిషనర్, సహాయక కమిషనర్లు రిషికను, వాల్తేర్ కేవీ సంగీతాచార్యులు డాక్టర్ ద్వారం త్యాగరాజు, నాట్యాచారిణి సుంకర కృష్ణవేణిలను అభినందించారు. ఈ సందర్భంగా బుధవారం కేంద్రీయ విద్యాలయంలో రిషికను ఘనంగా సత్కరించారు. పాఠశాల ప్రిన్సిపాల్ కమల్‌జీత్ మాట్లాడుతూ న్యూఢిల్లీలో నిర్వహించిన ఈ పోటీల్లో రిషిక కూచిపూడి నృత్యంతో అందరినీ మెప్పించి ప్రథమ బహుమతి, బంగారు పతకాన్ని అందుకున్నట్లు తెలిపారు. ఈ విజయం ద్వారా కేంద్రీయ విద్యాలయ సంఘటన్, వాల్తేర్ కేంద్రీయ విద్యాలయ పేరుప్రతిష్టలు మరింత పెరిగాయన్నారు. రిషికను ఈ నెల 26న న్యూఢిల్లీలో జరిగే గణతంత్ర వేడుకలకు, ప్రధానితో జరిగే పరీక్షా పే చర్చా కార్యక్రమానికి ప్రత్యేకంగా ఆహ్వానించినట్లు ఆయన పేర్కొన్నారు. సత్కార కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయిని శైలజ, కేవీ సిబ్బంది ఎం.రేఖ, వైస్ ప్రిన్సిపాల్ శ్రీమీనా, ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

దోమల నిర్మూలనకు ఫాగింగ్

సీతంపేట: జీవీఎంసీ 43వ వార్డులో బుధవారం సాయంత్రం దోమల నిర్మూలనకు మినీ ఫాగింగ్ చేపట్టారు. మలేరియా విభాగం సిబ్బంది ఆధ్వర్యంలో శ్రీనివాసనగర్, నందగిరినగర్, జగన్నాథపురం, దాడి రామ్మూర్తి కల్యాణ మంపడణం, శ్మశానవాటిక ఏరియా, గౌరీ కల్యాణ మంపడం వెనుక రోడ్డు ప్రాంతాల్లో ఈ కార్యక్రమం నిర్వహించారు.

అప్పన్న ఆలయంలో 'స్వచ్ఛ తీర్థ'


ఆస్థాన మండపాన్ని శుభ్రం చేయిస్తున్న ఈవో శ్రీనివాసమూర్తి

సింహాచలం: సింహగిరిపై శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామి ఆలయంలో బుధవారం స్వచ్ఛ తీర్థ కార్యక్రమం నిర్వహించారు. అయోధ్యలో శ్రీరామచంద్రుని విగ్రహ ప్రాణప్రతిష్ఠ సందర్భంగా దేశంలోని అన్ని దేవాలయాల్లో స్వచ్ఛ తీర్థ అభియాన్ నిర్వహించాలన్న ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు మేరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ ఆస్థాన మండపం, భోగ మండపం, ఆలయ ప్రాంగణాలను శుభ్రం చేశారు. అలాగే స్వామివారి పూజా సామగ్రి శుభ్రం చేశారు. ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి, ఉద్యోగులు పాల్గొన్నారు.

బాడీబిల్డింగ్ పోటీ విజేతకు సత్కారం


ధనుష్‌ను సత్కరిస్తున్న జిమ్ నిర్వాహకులు

పెదగంట్యాడ: మిస్టర్ ఆంధ్ర ఓపెన్ బాడీ బిల్డింగ్ పోటీల్లో గంగవరం గ్రామానికి చెందిన ధనుష్ సత్తా చాటాడు. పశ్చిమ గోదావరి జిల్లా ఆకివీడులో ఈ నెల 14న వెస్ట్ గోదావరి బాడీ బిల్డింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పోటీల్లో బంగారు పతకాలు సాధించాడు. 55 కిలోల లోపు విభాగంలో నిర్వహించిన బాడీ బిల్డింగ్‌లో ప్రథమ స్థానంలో నిలిచాడు. అలాగే మెన్స్ ఫిజిక్ పోటీల్లోనూ ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకుని బంగారు పతకాలు సాధించాడు. ధనుష్‌ను స్వామి ఫిట్‌నెస్ జిమ్‌లో బుధవారం ఘనంగా సత్కరించారు. పీత గురుమూర్తి, జి.తాతారావు, దుర్గారావు, రెడ్డి, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ముగ్గుల పోటీలు


పోటీల్లో ముగ్గులు వేస్తున్న మహిళలు

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 69వ వార్డు రెడ్డితుంగ్లాంలో కోదండ రామాలయ పరసను పురస్కరించుకుని మహిళలకు ముగ్గుల పోటీలను నిర్వహించారు. బుధవారం ఉదయం నిర్వహించిన పోటీల్లో మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు. పోటీల్లో మొదటి ముగ్గురు విజేతలకు కార్పొరేటర్ కాకి గోవిందరెడ్డి చేతుల మీదుగా స్టీల్ బిందెలను బహుమతిగా అందించారు. చిన్నారి వేసిన ముగ్గుకు కన్సొలేషన్ బహుమతిగా రెండు బిందెలు అందించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు పాల్గొన్నారు.